క్లుప్తంగా

సమయపాలన పాటించాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య సూచించారు. గురువారం మండలంలోని అమ్మాపురం, హచ్చుతండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్, ఇతర రికార్డులు, మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభపై పలు ప్రశ్నలు అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గుడి నిర్మాణానికి భూదానం

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే గంగమ్మ గుడి నిర్మాణానికి యాదవ సంఘం కమిటీ అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పంజాల సత్తయ్య కుమారులు పంజాల సోమనర్సయ్య, వాసుదేవ్, దేవరాజులు గుంటన్నర పట్టాభూమిని విరాళంగా ఇచ్చారు. దాతలతో కలసి యాదవసంఘం కమిటీ సభ్యులు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ బైరు అశోక్ గౌడ్, యాదవ సంఘం అధ్యక్షుడు బొబ్బల ముత్తయ్య, ఉడుత కొమురు మల్లు, ఎలేందర్, యాకాంతం, ఎల్లయ్య, శ్రీనివాస్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, వాటర్ బాటిళ్ల పంపిణీ



కేసముద్రం: చైతన్యనగర్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీడీఎస్ఎస్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బనిషెట్టి విజయ, వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్‌వెస్లీ, సుధాకర్, కపిల్, జ్యోత్స్న, కల్పన పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలతో పేదలకు లబ్ధి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. స్థానిక అశోక్‌భవన్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం నేరుగా లబ్ధిదారుడికి చేరుతుందన్నారు. సమావేశంలో రవీందర్‌రెడ్డి, కాసం శేఖర్, లాలూనాయక్, హనుమంతరావు, వెంకన్న, శ్రీనివాస్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిరక్షించాలి

తొర్రూరు: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని ఆలయ అర్చకులు అలహరి శ్యాంసుందరాచార్యులు కోరారు. గురువారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అర్చకులు మాట్లాడారు. తొర్రూరులోని 130 సర్వే నంబర్‌లో వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో 50 అక్రమ నిర్మాణాలు వెలిశాయన్నారు. రోజురోజుకు భూమి ఆక్రమణలతో కుచించుకుపోతుందన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆలయ భూముల్లో సంత నిర్వహిస్తున్నారని దానికి ఎలాంటి రుసుము దేవాదాయ శాఖకు చెల్లించడం లేదన్నారు. తాను ఆలయ అర్చకుడిగా ఎలాంటి జీతభత్యాలు లేకుండా పని చేస్తున్నానని, దూప దీప, నైవేధ్యాలు సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నానని తెలిపారు. ఆక్రమణలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆలయ భూముల్లో వేణుగోపాల స్వామి గుడి, కళ్యాణ మండపంలు నిర్మించాలని కోరారు. సమావేశంలో అర్చకులు గోవర్ధనం రామాచార్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మద్దిరాల: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల వద్ద 365వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానిక ఎస్సై వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి వల్లపు సోమనర్సమ్మ(70) గురువారం తన తల్లిగారి ఊరైన మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి వస్తోంది. పోలుమల్ల గ్రామం వద్ద రహదారి దాటుతుండగా.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన కేతం రాజు కారులో అతివేగంగా వస్తూ సోమనర్సమ్మను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి మనవడు వల్లపు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- పందుల స్వైరవిహారం
- దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- సీజనల్ వ్యాధులతో భయాందోళన

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ప్రాంతంలోని పాత సమైక్య జూనియర్ కాలేజీ ప్రక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైర విహారం చేస్తుండడంతో విపరీతంగా దోమలు పెరిగిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమ కాటుతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని వారం రోజుల నుంచి కార్యాలయంలో తెలియచేసినా స్పందన లేదని చెబుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడం గమనార్హం. కలెక్టర్ ఆదేశాలను సైతం మానుకోట మున్సిపాలిటీలో అధికారులు బేఖాతరు చేయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

బ్యాంకు సేవలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారి

దంతాలపల్లి: బ్యాంకులు అందించే సేవలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ ఆర్ఎం కమలాకర్ అన్నారు. మండలంలోని రేపోణి గ్రామంలోని సీఎఫ్ఎల్ నర్సింహులపేట, యూనియన్ బ్యాంకు దంతాలపల్లి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన సురక్ష శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి 70 సంవత్సరాలు వయస్సు వారు ప్రధానమంత్రి యోజన కింద సంవత్సరానికి రూ.20, 18 నుంచి 50 వయస్సు లోపువారు రూ.436 చెల్లించాలని సూచించారు. అనంతరం ఏపీఐ సుకన్య సమృద్ధి యోజన పథకం, ఎన్‌సీపీ వాత్సల్య పథకం, సైబర్ క్రైమ్ కేవైసీ వివిధ బ్యాంకు సంబంధిత సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎల్‌డీఎం యాదగిరి, ఎఫ్ఐడీ రవివర్మ, బీఆర్ఎం మనీష్, దంతాలపల్లి, తొర్రూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్లు అజయ్ కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పొదుపును అలవర్చుకోవాలి

కురవి: ప్రతీ ఒక్కరు పొదుపును అలవర్చుకోవాలని మహబూబాబాద్ ఇందిరా చౌక్ బ్రాంచ్ బ్యాంక్ మేనేజర్ సురేష్ అన్నారు. మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీ పరిధిలో జనసురక్షలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, పిల్లలకు సుకన్య సమృద్ధి యోజనతో సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ సీఎంఎఫ్ఎఫ్ కౌన్సిలర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ఆర్థికసాయం

గార్ల: ఆర్థిక స్తోమత లేక ఇంట్లో ఉండి చదువుకొని మద్రాస్ ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థి పలీమల శ్రీనివాస్ హాస్టల్ ఫీజు కోసం గార్లలోని గణేష్ యువసేన స్వచ్ఛంద సేవా నిధి నుంచి రూ.10,000 అందజేశారు. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన విద్యార్థి తల్లి బుశేశ్వరి ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ తన ఇద్దరు కుమారుడి చదివించగా, కుమారుడు ఐఐటీలో సీటు సాధించాడు. కార్యక్రమంలో కట్టా రమేష్, కమల అగర్వాల్, కోట ఉత్తరయ్య, గౌరవ్ అగర్వాల్, రాకేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

నెహ్రూసెంటర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగష్టు 9న ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవం నిర్వహించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పాలకుల విధానాల మూలంగా గిరిజన, ఆదివాసీలు తమ హక్కులను కోల్పోతున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయక తప్పదన్నారు. పీసా చట్టం, 1/70 చట్టం, అటవీహక్కుల చట్టం అమలు చేయాలని, ఆదివాసీ గిరిజనుల భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కొల్లగొట్టే ప్రయత్నాలను తప్పికొమురంభీం,బీర్సా ముండా, అల్లూరి త్యాగాల స్పూర్తితో తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మగాని సత్యం, రామచందర్, ప్రవీన్, వీరునాయక్, వెంకన్న, యాకయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు వాంకుడోత్ తండాకు చెందిన వాంకుడోత్ సుందర్(49) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జూలై 31న వరంగల్–ఖమ్మం హైవే నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. పెట్రోల్ బంక్ వద్ద ఎద్దు అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుందర్ మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో గాయాలు

పెద్దవంగర: వీధి కుక్కల దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఉడుత సోమల్లు (55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం పనికి బయల్దేరిన సమయంలో గ్రామంలోని వీధి కుక్కలు అతనిపై దాడికి తెగబడ్డాయి. మెడచుట్టూ గాయాలతో కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గుర్తించి తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.



గాయపడిన సోమల్లు


తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

తల్లిపాలతో బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పలువురు వైద్యులు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రంలో..



నెహ్రూసెంటర్‌లో..



తొర్రూరులో..

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన సత్యమ్మ మృతిచెందగా ఆమె కుమారుడు మనోహర్‌ను, లక్ష్మీపురం (బ్రాహ్మణపల్లి) గ్రామ శివారు గడి తండాకు చెందిన బాదావత్ బుజ్జి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గురువారం పరామర్శించారు. మాల్కిమాల్యా, సక్రాంనాయక్, అశోక్, వెంకటరెడ్డి, షఫియుద్దీన్, బాలు, సుమన్, మల్సూర్, షరీఫ్, నెహ్రు పాల్గొన్నారు.

నివాళులర్పించిన రెడ్యా

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన ఒంటెల వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడు కిరణ్ రెడ్డి బైక్ ఆక్సిడెంట్ కారణంగా తీవ్ర గాయాలపాలై గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ చెక్కల శ్రీను, మూల శ్రీనివాస్ రెడ్డి, అశోక్, శ్రీశైలం ఉన్నారు.

మోడల్‌స్కూల్‌లో తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో తీజ్ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థినులు గిరిజన వేషధారణలో ఆటపాటలతో నృత్యాలు చేశారు. దీంతో పాఠశాలలో పండుగ సందడి చోటుచేసుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, సురేందర్, సామల నర్సయ్య, గుంటుక రాజేందర్, రుద్ర శ్రీకాంత్, జనార్దన్, గుల్లెపల్లి రాజేష్, సమ్మయ్య, చిట్యాల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వడ్డెకొత్తపల్లిలో..

పెద్దవంగర: లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో వడ్డెకొత్తపల్లిలో చేనేత దినోత్సవం, ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి, రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేతపై ఆధారపడిన కార్మికులను సంత్కరించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కృషిని గుర్తుకు చేసుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున చారి, ప్రధాన కార్యదర్శి రాపోలు శ్రీనివాస్, కోశాధికారి ముధుసూదన్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్

గూడూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ పిలుపులో భాగంగా మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఇంటింటికీ బీజేపీ, ప్రతీ ఇంటికి బూత్ అధ్యక్షులు అనే కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీతారాంనాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు తమవిగా కాంగ్రెస్ చెప్పుకోవడం సరికాదన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్ర నిధులు ఎన్నో తెలంగాణకు కేటాయించారని, వాటిని పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, మల్లయ్య, సురేందర్, నాగరాజు, మల్లేష్‌యాదవ్, అనిల్, సోమూనాయక్,లక్ష్మణ్, మోతీలాల్, శ్రీశైలం, నమో రవి, రాజు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సీతారాంనాయక్

రాఖీ కొనుగోళ్లు, వేడుకలు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రాఖీల కొనుగోళ్ల సందడి నెలకొంది. పలు విద్యాసంస్థల్లో ముందస్తు వేడుకలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాఖీ విక్రయ కేంద్రాలు వెలిశాయి. చిన్న పిల్లలు, యువతులు, మహిళలను ఆకర్షించే రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ.5 నుంచి రూ.300 వరకు ధరలు ఉన్నాయి.

– సాక్షినెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్ : రాఖీలు కడుతున్న రూరల్ ఎస్సై దీపిక



బయ్యారంలో రాఖీల షాపు



తొర్రూరు:రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



మరిపెడ రూరల్: చిల్లంచర్ల హై స్కూల్‌లో..

సంక్షిప్త సమాచారం..

వార్డులో శ్రమదానం

డోర్నకల్: స్థానిక మున్సిపాలిటి పరిదిలోని 11వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. వార్డు నాయకుడు రెడ్డబోయిన శంకర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వార్డులో చెత్త తొలగించి కాల్వలు శుభ్రపరిచారు. కార్యక్రమంలో కొత్త యాకేష్, బి.సత్యనారాయణ, వీరభద్రం, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ వెంకటేశం పాల్గొన్నారు.

రాజకీయ చదరంగంలోకి లాగొద్దు

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేపట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్ ధర్నాపై బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ముస్లింల కోసమేనంటూ మాట్లాడుతున్నారని, పార్టీల రాజకీయ చదరంగంలోకి ముస్లింలను లాగొద్దని తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అమ్మద్‌ఖాన్ గురువారం అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొలేక ముస్లింలను టార్గెట్ చేసి బీజేపీ నేతలు మాట్లాడడం సరికాదని హితవుపలికారు.

బ్లాక్ అధ్యక్షుడికి సీఎం అభినందన

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన నివాసంలో గురువారం అభినందించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో చేపట్టిన మహాధర్నాలో మహబూబాబాద్ జిల్లా తరపున పాల్గొన్నందున అభినందించినట్లు కమలాకర్ గురువారం తెలిపారు.

గిరిజన జర్నలిస్టులను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : గిరిజన జర్నలిస్టులను ప్రభుత్వం, తెలంగాణ ప్రెస్ అకాడమీ ద్వారా ఆదుకోవాలని తెలంగాణ ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతినాయక్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడేనికి చెందిన ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లావుడియా మనోహర్ తల్లి సత్యమ్మ పెద్దకర్మ సందర్భంగా బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్టు చందుకు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వెంకట్, వినోద్, అశోక్, రాధాకృష్ణ, లాలు, నరేందర్, శంకర్ పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్/కళాశాలలో ఇటీవల నిర్వహించిన మాక్ పోల్‌లో విజయం సాధించిన హెడ్‌బాయ్స్, హెడ్ గరల్స్ విజేతలచేత గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్ ప్రమాణస్వీకారం చేయించి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల చైర్మన్ కనకమ్మ, కేజీబీవీ ఎస్ఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపుల కేసులో వ్యక్తి అరెస్ట్

బయ్యారం: మండలంలోని గంధంపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిలబడ్డ వ్యక్తులను బెదిరించి వారి నగదు, వస్తువులను తీసుకున్న ఘటనలో గురువారం వ్యక్తిని అరెస్ట్ చేయగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గార్ల మండల కేంద్రానికి చెందిన ఉస్మాన్‌పాషా, అన్వర్, గోపిచంద్ మంగళవారం రాత్రి ఇల్లందు వెళ్లేందుకు గంధంపల్లి బస్టాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో కస్తూరీనగర్‌కు చెందిన మురళీకృష్ణతోపాటు మరో ఐదుగురు వ్యక్తులు కారు, రెండు బైక్‌లపై వెళ్తూ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ముగ్గురిని బెదిరించి వారి నుంచి రూ.2 వేలతోపాటు కొన్ని వస్తువులను తీసుకున్నారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గురువారం మురళీకృష్ణను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు. కారుతోపాటు రెండు బైక్‌లను సీజన్ చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

పెద్దవంగర/దంతాలపల్లి/నెల్లికుదురు/చిన్నగూడురు/గూడూరు: చిన్నారుల్లో పలు ఆరోగ్య సమస్యలకు ప్రధానం కారణం నులిపురుగులని, వీటి నుంచి పిల్లలను రక్షించుకునేందుకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని వైద్యులు సూచించారు. నులిపురుగులు పిల్లల ఎదుగుదలను అడ్డుకుంటాయని తెలిపారు. ఈ నెల 11న నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు మాత్రలు వేయించాలని సూచించారు. ఈసందర్భంగా ఆయా మండలాల్లోని పీహెచ్‌సీల్లో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దవంగరలో డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. దంతాలపల్లిలో డాక్టర్ కవిత, గూడూరు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, నెల్లికుదురు వైద్యాధికారి శారద, చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

నియామకం

గూడూరు: మండలంలోని పొనుగోడు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మాదారపు అశోక్‌ను పీఆర్‌టీయూ టీఎస్ మండల కార్యదర్శిగా నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



మాదారపు అశోక్

పీహెచ్‌సీ ఎదుట పీవైఎల్ నిరసన

కేసముద్రం: సీజనల్ వ్యాధులు అరికట్టడంతోపాటు, వైద్యులు అందుబాటులో ఉండాలంటూ గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట పీవైఎల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యులు స్థానికంగా 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ నంబీకిషోర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజు, దూడయ్య, యాకయ్య, రాము పాల్గొన్నారు.

బాలికల భద్రతే షీ టీం లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్ : బాలికల, మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన బాలికల భద్రతపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. హెచ్‌ఎం కొట్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సునంద

కాల్వల పూడికతీత పనులు ప్రారంభం

గార్ల: మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ఆర్థిక సహకారంతో కట్టుకాల్వ ఆయకట్టు కింద కాల్వల్లో పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. పిచ్చిమొక్కలు తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు వాపోయారు. రైతులు మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.